సాక్షి నంద్యాల

ఆదివారం • 1 • అక్టోబర్ • 2023



కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శనివారం 8,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



వృద్ధాప్యంలో ఆదరణ

వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోంది. వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంతోపాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తూ మందులు ఉచితంగా అందజేస్తోంది.

8లో▸



14,15 తేదీల్లో ఎస్‌ఐ 'మెయిన్స్'

ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షను ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నారు. రాయలసీమ జోన్‌కు సంబంధించి మెయిన్స్‌కు 8,347 మంది అర్హత సాధించారు.

8లో▸

న్యూస్‌రీల్

ఆశాజనకంగా వర్షాలు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కూడా పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 19 మండలాల్లో సగటు వర్షపాతం 10.9 మి.మీగా నమోదైంది. అత్యధికంగా గడివేములలో 53.6 మి.మీ, అత్యల్పంగా కొలిమిగుండ్లలో 0.8 మి.మీల వర్షపాతం నమోదైంది. పాములపాడు 42.8 మి.మీ, వెలుగోడు 39.4, ఆత్మకూరు 30.4, కొత్తపల్లి 30.2, జూపాడుబంగ్లా 24.6, ప్యాపిలి 18.2, బేతంచెర్ల 15.2, మహానంది 14.6 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మద్దిలేటయ్యకు ఒక్క రోజు ఆదాయం రూ.6.13 లక్షలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజు వివిధ సేవల ద్వారా రూ.6,13,907 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శైలజ, గిద్దారెడ్డి దంపతులు నిత్య అన్నదానానికి రూ. 50 వేలు, సుధీర్ రెడ్డి కుమారుడు క్షితిజ్ ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.

నేటి నుంచి పింఛన్ల పండుగ

నంద్యాల(న్యూటౌన్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును శనివారం బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. ప్రతి నెల 1వ తేదీ వస్తుందంటే అవ్వతాతలు, వికలాంగులు ఇతర అన్ని వర్గాల వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఆదివారం ఉదయం నుంచే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తారు. జిల్లాలో 2,23,208 పింఛన్లకు సంబంధించి మొత్తం రూ.61.65 కోట్ల నిధులు మంజూరైనట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

సర్వ నరసింహుడికి అజ్ఞాత భక్తుడి భారీ విరాళం

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామికి ఓ అజ్ఞాత భక్తుడు భారీ మొత్తం విరాళంగా ఇచ్చారు. శనివారం ఆలయంలోని మూడు హుండీలలో కానుకలు లెక్కించారు. గతేడాది ఆగస్టు నుంచి నేటి వరకు రూ. 9.44 లక్షల ఆదాయం వచ్చింది. ఏటా రూ. 3 నుంచి 4 లక్షల ఆదాయం వస్తుండగా, ఈ ఏడాది రూ. 9.44 లక్షల ఆదాయం వచ్చింది. కాగా ఓ హుండీలో పదికి పైగా రూ. 500 నోట్ల కట్టలు ఉండటంతో ఓ భక్తుడు స్వామి వారికి రూ. 5 లక్షలకు పైగా సమర్పించినట్లుగా తెలుస్తోంది. ఆలయం కింద ఉన్న ఉప హుండీ ద్వారా నెల రోజుకు సంబంధించి రూ. 74 వేల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎండో మెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ నరసయ్య, చైర్మన్ రామాంజనేయరెడ్డి, ధర్మకర్త మెంబర్లు పాల్గొన్నారు.



నందికొట్కూరు పట్టణంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ



కొలిమిగుండ్ల మండలం బెలుం వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



మహానంది మండలం బుక్కాపురంలో బీపీ పరీక్షించుకుంటున్న ఎంపీపీ యశస్విని

తరలివచ్చిన వైద్యం

- జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం
- మొదటి రోజు విశేష స్పందన
- దాదాపు 10 వేల మందికి వైద్య పరీక్షలు

నంద్యాలటౌన్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేరుతో ఊరూవాడా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. తొలి రోజు శనివారం ప్రతి మండలంలో ఒక గ్రామంతో పాటు పట్టణాల్లోని యుపీహెచ్‌సీలో క్యాంపు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యశిబిరం గురించి ప్రజలకు ముందుగానే సమాచారం ఇచ్చి టోకెన్లు ఇవ్వడంతో ఆయా శిబిరాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు చికిత్స అందించారు. స్పెషలిస్టులలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, పెథాలజీ తదితర విభాగాల వైద్యులు ఉన్నారు. సగటున ప్రతి క్యాంపులో ఓపీకి 500 మంది దాకా ప్రజలు చికిత్స కోసం వచ్చినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఆయా వైద్యశిబిరాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్‌ల పంపిణీ, ల్యాబ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ కౌంటర్లు, మందులు ఇచ్చే కేంద్రాలు, స్పాట్ సర్వే కౌంటర్, తాగునీటి ఏర్పాట్లను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు 22 ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో దాదాపు 10 వేల మందికి వైద్య సేవలు ఉచితంగా మందులు అందజేశారు.

➤ నందికొట్కూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశీలించారు. పేదలుకు అందుతున్న వైద్య సేవలు, ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఆరోగ్యం వెల్లివిరియడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీర్ఘకాలిక వ్యాధుగ్రస్తులను గుర్తించి వారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిశోర్ పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ పట్టణంలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేయిస్తున్న ప్రజలు

➤ ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టోకెన్ల పంపిణీ మేరకు అధికారులు ముందుగానే భారీ ఏర్పాట్లు చేశారు. ఇందులో వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది 150 మందికి పైగా పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న కార్యక్రమాలతో గ్రామీణుల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందన్నారు.

➤ శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గిరిజనులకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాస తప్పిందన్నారు. మహానంది మండలంలో బుక్కాపురం వైద్య శిబిరంలో 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో 553 మందికి వైద్యసేవలు అందాయి.

➤ గోస్పాడు మండలం ఒంటివెలగల గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పకడ్బందీగా సర్వే నిర్వహించడంతో క్షేత్ర స్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 309 మందికి వైద్య పరీక్షలు అందించారు. అందులో 76 మంది కంటి పరీక్షలు, 46 మందిని పట్టణ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

➤ గడివేముల మండలం కొరటమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వినూత్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. అధికారులు మరింత ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

➤ బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలలో ప్రజలు ఆసుపత్రులకు పరుగెత్తకుండా వైద్యులనే ప్రజల దగ్గరకు పంపి వైద్యం చేయించే కార్యక్రమం చేపట్టడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టికి నిదర్శనమన్నారు.

➤ డోన్ మండలం గుమ్మకొండ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మీట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపడుతూ ప్రజల అభిమానం చూరగొంటున్నారన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చుకుందామన్నారు.

➤ బేతంచెర్ల పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య రంగంలో సమూల మార్పులు చేస్తు వైద్య రంగ అభ్యున్నతికి పాటుపడుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



దుద్యాలలో వృద్ధుడికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



గోస్పాడు మండలం ఒంటివెలగలలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు



కొత్తపల్లి మండలం దుద్యాలలో ఈసీజీ చేయించుకుంటున్న దృశ్యం



ఆళ్లగడ్డ వైద్య శిబిరంలో మహిళలకు వైద్య సేవలు అందిస్తూ..

“ రక్త పరీక్ష చేసి మందులు ఇచ్చారు



సుమారుగా పదేళ్లుగా కడుపులో నొప్పిగా ఉంది. ప్రైవేటు ఆసుపత్రికి పోయేంత స్థోమత లేక పోవడంతో చిన్నచిన్న ఆసుపత్రి వెళ్తే అప్పటికప్పుడు నొప్పి తగ్గేటట్లు మాత్రలు, సూదులు వేసేవారు. ఇప్పుడు వచ్చి పరీక్ష చేయించుకుంటే కిడ్నీలో రాళ్లు ఉన్నాయని ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. ప్రస్తుతానికి మందులు ఫ్రీగా ఇచ్చారు.

– మేరీ, ఆళ్లగడ్డ

థ్యాంక్యూ సీఎం సార్



మా గ్రామంలోనే అన్ని వ్యాధులకు ప్రత్యేకమైన వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేయించి ఇక్కడే ఉచితంగా మందులు ఇస్తున్నారు. నాకు కంటి చూపు సరిగా లేక నంద్యాలలో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నా. కొన్ని రోజుల తర్వాత కంటి చూపు మళ్లీ మసక బారింది. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా డాక్టర్లు కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు కూడా ఇచ్చారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్‌కు థ్యాంక్స్.

– కృష్ణుడు, దుద్యాల గ్రామస్తుడు, కొత్తపల్లి మండలం

ఇంటి వద్దకే ఆరోగ్యసేవలు బాగున్నాయి



గతంలో జ్వరం, దగ్గొస్తే ఆస్పత్రికి వెళ్లేవాళ్లం. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే చిన్నరోగాలకే చాలా డబ్బులు ఖర్చయ్యేవి. ఇప్పుడు అలా ఏమి లేకుండా డాక్టర్లు, నర్సులు ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా పరీక్షలు చేయడం సంతోషంగా ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల మాదిరి అన్ని పరీక్షలు చేసి పెద్దపెద్ద డాక్టర్లతో చూపించుకున్నాం. పైసా లేకుండా ఉచితంగా మాత్రలు, మందులు ఇచ్చారు.

–రసూల్‌బీ, బుక్కాపురం, మహానంది మండలం

కంటి అద్దాలు, మందులు ఇచ్చారు



కూలీకి వెళ్లే నేను కొన్ని నెలలుగా కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాను. రెండు నెలల క్రితం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు కింద కంటి పరీక్షలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా, మందులు అందజేశారు.

– ఈడిగ భగవంతప్ప, బేతంచెర్ల

న్యాయమూర్తులకు వర్క్‌షాప్



హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, హెచ్‌ఆర్‌సీ చైర్మన్ సీతారామమూర్తితో జిల్లా న్యాయమూర్తులు

కర్నూలు (లీగల్): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ నేతృత్వంలో నోడల్ అధికారి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సీతారామమూర్తి, విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మీనరసింహారెడ్డి సివిల్ కేసులో డాక్యుమెంటరీ ఎవిడెన్స్ గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు , అదనపు జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

- సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు వివరించండి
- జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి

నంద్యాల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడం ధ్యేయంగా జేసీఎస్ కన్వీనర్లు ప్రజలకు మరింత చేరువ కావాలని జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చల్లా మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రీజనల్ కో ఆర్డినేటర్ అమర్నాథరెడ్డితో పాటు నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ పార్టీ పరిశీలకులు మహాలక్ష్మి శ్రీనివాస్, కోరెడ్డి నరసింహారెడ్డి, ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, అబ్దుల్‌ఖాన్, ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా మధుసూదనరెడ్డి మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ తరపున ఇన్సూరెన్స్ సైతం చేయిస్తున్నామని, వివరాలు అందజేసి వంద శాతం పూర్తయ్యేలా జేసీఎస్ కన్వీనర్లు బాధ్యతగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. రాబోయే రోజుల్లో జేసీఎస్ కన్వీనర్లు పార్టీ కోసం మరింత శ్రమించాలన్నారు. టీడీపీ నాయకులు మభ్యపెట్టే మాయమాటలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు.

➤ జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్నాథరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికి తెలియజేయాలన్నారు. చంద్రబాబు హయాంలో కేవలం టీడీపీ అనుచరులు మాత్రమే పథకాలు అందేవన్నారు. వీటన్నింటిని జేసీఎస్ కన్వీనర్లు ప్రజలకు వివరించాలన్నారు.

➤ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే ఆయన పీఏ శ్రీనివాసులు దేశం విడిచి ఎందుకు పారిపోయారో టీడీపీ నాయకులు చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసొచ్చినా తాము మాత్రం ప్రజలనే నమ్ముకుని ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ఆకేపాటి అమర్నాథరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు



హాజరైన జేసీఎస్ మండల కన్వీనర్లు

క్లుప్తంగా

డ్వామా శిక్షణ కేంద్రంలో రేపు గాంధీ జయంతి వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): జగన్నాథగట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థ శిక్షణ కేంద్రంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వంద మందికిపైగా రక్తదానం చేయనున్నారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అన్ని అంశాల్లో అద్భుత పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రసంసాపత్రాలు, జ్ఞాపికలు కలెక్టర్ సృజన చేతుల మీదుగా అందజేయనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు ప్లానింగ్ ప్రక్రియను చేపట్టే కార్యక్రమాన్ని అక్టోబరు నెల 2న శ్రీకారం చుట్టనున్నారు.

బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయం

- ఆధార్ ఈ కేవైసీ హ్యాక్ చేసిన సైబర్ కేటుగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

కోడుమూరు రూరల్: ఆధార్ ఈ కేవైసీని హ్యాక్ చేసి సైబర్ కేటుగాళ్లు అనుమానం రాకుండా విడతల వారీగా బ్యాంక్ ఖాతాల్లో నగదును కాజేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కొద్ది రోజుల క్రితం స్థలాల రిజిస్ట్రేషన్ కోసం కోడుమూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో వినోద్‌కుమార్, ఫారూక్, హుస్సేన్, నందకుమార్, మధు తదితరులు ఆధార్ ఈ కేవైసీ చేశారు. అయితే రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత వినోద్‌కుమార్ ఖాతా నుంచి మూడు విడతల్లో రూ.17వేలు డ్రా చేశా రు. అలాగే ఫారూక్, హుస్సేన్, నందకుమార్, మధు ఖాతాల నుంచి కూడా రూ. 8వేల నుంచి రూ. 20వేల వరకు నగదును విడతల వారీగా సైబర్ కేటుగాళ్లు డ్రా చేసుకున్నారు. బాధితులు స్థానిక ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుకు వెళ్లగా ఆధార్ ఈ కేవైసీ ద్వారా నగదును మహారాష్ట్రలోని థానేలో డ్రా చేశారని చెప్పారు. దీంతో కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులును ఆశ్రయించి ఫిర్యా దు చేశారు. ఫిర్యాదును పరిశీలించి సైబర్ క్రైమ్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా.. ఆధార్ ఈకేవైసీ హ్యాక్ అయిన ఘటనపై కోడుమూరు సబ్ రిజిస్ట్రార్ అధికారులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌గా రాఘవరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌గా జీవీ రాఘవరెడ్డిని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. కడపకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది జీవీ రాఘవరెడ్డిని కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లా జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు.

3 నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 16 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేశామని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు రెగ్యులర్ 3,157 మంది, సప్లిమెంటరీ 916 మంది విద్యార్థులు రాయనున్నట్లు చెప్పారు.

వృద్ధాప్యంలో ఆదరణ

- అరవై ఏళ్లు పైబడిన వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఓపీ సేవలు
- అవసరమైన పరీక్షలు, మందులు, చికిత్స ఉచితం
- జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 10,79,764 మందికి చికిత్స
- వృద్ధుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరి జీవితంలో వృద్ధాప్యం సహజం. అప్పటి వరకు జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న వారు జీవిత చరమాంకంలో సుఖంగా జీవించాలని కోరుకుంటారు. ఇందుకోసం చాలా మంది ప్రణాళికలు రూపొందించుకుంటారు. మరికొందరు కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవిస్తుంటారు. అయితే కొందరి విషయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కొరవడుతోంది. వృద్ధాప్యంలో పెద్దల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అసలే వృద్ధాప్యం.. పైగా వ్యాధులు వెంట వచ్చిన జీవితం కావడంతో జీవిత చరమాంకంలో పోరాటం తప్పని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా కల్పిస్తోంది. వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తూ మందులు అందజేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం 2011లో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో భాగంగా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్ కేర్ ఆఫ్ ఎల్డర్లీ(ఎన్‌పీహెచ్‌సీఈ)ని రూపొందించింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అమలు కాలేదు. పెద్దలపై ఉన్న గౌరవంతో ప్రస్తుత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, బోధనాసుపత్రుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ మేరకు వృద్ధులకు చాలా చోట్ల ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వార్డు, ఓపీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఆగస్టు నెల వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లకు పైబడిన వారు 10,79,764 మంది చికిత్స పొందారు. వారికి ఆయా కేంద్రాల్లో అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. స్పెషలిస్టు వైద్యులచే చికిత్స చేయించడంతో పాటు అవసరమైన వారికి ఫిజియోథెరపీ కూడా చేయించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలోనూ వృద్ధులను వారి ఇంటి వద్దకే వెళ్లి చూస్తున్నారు.



వృద్ధునికి వైద్యపరీక్ష చేస్తున్న సిబ్బంది

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు చికిత్సలు ఇలా..

మాసం	ఏరియా ఆసుపత్రి	సీహెచ్‌సీ	పీహెచ్‌సీ	యుపీహెచ్‌సీ	మొత్తం
ఏప్రిల్	6279	3,753	45,349	13,040	68,421
మే	12,558	7,506	89,390	26,080	1,35,534
జూన్	25,116	15,012	1,77,896	52,111	2,70,135
జులై	50,232	29,986	3,55,663	1,04,211	5,40,092
ఆగష్టు	6,143	3,635	42,972	12,832	65,582
మొత్తం	1,00,328	59,892	7,11,270	2,08,274	10,79,764

వృద్ధుల ఆరోగ్యమే ధ్యేయంగా కార్యక్రమాలు



వృద్ధుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లు పైబడిన వారి కోసం ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. వారికి స్పెషలిస్టు వైద్యులచే చికిత్స, అవసరమైన మందులు, ఫిజియోథెరపీ అందుతున్నాయి. వయోవృద్ధులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మీ ఆరోగ్యపరిస్థితి చెప్పి చికిత్స తీసుకోవాలి.

– హేమలత, ఎన్‌సీడీ జిల్లా అధికారి, కర్నూలు

నిర్లక్ష్యం చేయకూడదు



ఇంట్లో వృద్ధులను నిర్లక్ష్యం చేయకూడదు. వారిని కనిపెట్టుకుని ఉండాలి. వారు తరచూ కింద పడే అవకాశం ఉంది. దీనివల్ల తుంటి ఎముక విరగడం, తలకు గాయం కావడం జరుగుతాయి. తరచూ బీపీ, షుగర్, గుండెజబ్బులు, కంటి పరీక్షలు చేయిస్తూ ఉండాలి. వారి చెప్పేది జాగ్రత్తగా విని ఆచరించాలి. వృద్ధాప్యంలో సమస్యలు రాకుండా ఉండాలంటే రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి.

– డాక్టర్ పి.రవికళాధర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం నూతన కమిటీ

నంద్యాలటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా డాక్టర్ల విభాగం కమిటీని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు నంద్యాల జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా బీవీ సుబ్బారెడ్డి (నంద్యాల), ఉపాధ్యక్షులుగా ఎస్ మొహమ్మద్ రఫీ (నందికొట్కూరు), ఎం నిరంజన్‌రెడ్డి (నంద్యాల), జనరల్ సెక్రటరీలుగా, రవికుమార్ (బనగానపల్లె) వంశీ చౌదరి (డోన్), షేక్షావలి (ఆళ్లగడ్డ), కృష్ణయ్య (పాణ్యం), అమర్‌నాథ్ (శ్రీశైలం), మిన్నల(నంద్యాల), కార్యదర్శులుగా సలీం బాషా(నందికొట్కూరు), విశ్వనాథ్‌రెడ్డి (డోన్), చంద్రమౌళి (ఆళ్లగడ్డ), సాయిచైతన్య (పాణ్యం,. బాల సురేష్ (బనగానపల్లె), నాగేషుడు (శ్రీశైలం), సహాయ కార్యదర్శులుగా బాలసుబ్బయ్య (డోన్), జాకీర్ హుస్సేన్ (బనగానపల్లె), నూర్‌బాషా (శ్రీశైలం), నరసింహప్రసాద్, వలి (ఆళ్లగడ్డ), దస్తగిరి, మహమ్మద్‌హుస్సేన్, జనార్దన్ (బనగానపల్లె), రవికుమార్, చంద్రశేఖర్, సలీంబాషా (నందికొట్కూరు), వెంకట సుబ్బయ్య (పాణ్యం)లను నియమించారు.

కాన్వొకేషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గో కాన్వొకేషన్ దరఖాస్తు గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఇంత వరకు దరఖాస్తు చేయని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నుంచి స్వీకరించిన అభ్యర్థనల దృష్ట్యా గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు.

రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- ఎన్‌ఎల్‌ఎం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
- జేసీ టీ.రాహుల్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

నంద్యాల(సెంట్రల్): రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రాణించి వ్యాపారవేత్తలుగా ఎదగాలని జేసీ టీ.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... జేసీగా విధుల్లో చేరకముందు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో భాగంగా మత్స్యశాఖ కార్యదర్శిగా పనిచేశానని, ఆ సమయంలో తమ కార్యాలయం పక్కనే పశుసంవర్ధక శాఖ ఆఫీస్ ఉండటంతో ఎన్‌ఎల్‌ఎం స్కీం గురించి పూర్తిగా తెలుసుకున్నానన్నారు. 20 ఏళ్ల క్రితం నుంచి సమాజంలో క్రమంగా కార్బోహైడ్రేట్ల వినియోగం తగ్గి, ప్రొటీన్లతో కూడిన ఆహార వాడకం పెరిగిందని పేర్కొన్నారు. అయితే డిమాండుకు తగ్గ సరఫరా లేక దేశంలో మాంసం, గుడ్ల కొరత ఉందని, దీన్ని నివారించటంలో భాగంగానే నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి, దాణా తయారీకి భారీస్థాయి రాయితీలతో యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. దీంతో ఇన్నాళ్లూ ఉత్పత్తి దారుడిగానే మిగిలిపోయిన రైతన్న వ్యాపారవేత్తగా మారే అవకాశం లభిస్తుందన్నారు. వ్యవసాయం అనుకూలంగా లేనప్పుడు అనుబంధ రంగాలే రైతులకు ఆసరాగా నిలుస్తాయన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్ మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల ఫాంకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రాయితీ ఇస్తున్నామని వెల్లడించారు. 65 సంవత్సరాలలోపు అందరూ పథకానికి అర్హులేనని అన్నారు. యూనిట్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకునే వారు ప్రాజెక్టు నివేదిక సమగ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎల్‌ఎం పథకానికి దరఖాస్తు చేసుకునే విధానాన్ని రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కూలంకషంగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శిరప శ్రీనివాసరెడ్డి, గొర్రెల పెంపకం దారుల సమాఖ్య చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల ఉప సంచాలకులు పీవీ రమణమూర్తి, ఆళ్లగడ్డ డీడీ వరప్రసాద్, ఎస్‌టీసీ ప్యాపిలి డీడీ శాంతయ్య, నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ వెంకట సుబ్బారెడి, ఎస్‌టీసీ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్ష

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఐజీ



కేవీఆర్ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడుతున్న డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల్లో 8,347 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షను అక్టోబర్ 14, 15 తేదీలలో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలను శనివారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, సిస్టర్ స్టాన్సిలాస్ మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని కేవీఆర్ ప్రభుత్వ కాలేజీ ఫర్ ఉమెన్, కోట్ల సర్కిల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలను డీఐజీ పరిశీలించారు. పెద్దటేకూరు శివారులో ఉన్న బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ, దూపాడు సమీపంలోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల, కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నంద్యాల రోడ్డులోని రాయలసీమ యూనివర్సిటీ, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, నందికొట్కూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, రవీంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కేంద్రాలను ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎస్‌ఐ పరీక్షల ఏర్పాట్లపై ఆయా కళాశాల యాజమాన్యాలతో మాట్లాడారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, తాలూకా సీఐ శ్రీరామ్, కర్నూలు తాలూకా రూరల్ సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏసీబీ వలలో కోటేకల్ వీఆర్వో

- లంచం తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్



వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: కోటేకల్ వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు శనివారం సాయంత్రం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాలు.. కోటేకల్ గ్రామానికి చెందిన తెలుగు జయరాముడు తన పొలం వాల్యుయేషన్ సర్టిఫికేట్ కోసం 15 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సర్టిఫికెట్ ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు లంచం ఇవ్వాలని వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అయితే రూ.1,500 చొప్పున ఇస్తానని రైతు తెలుగు జయరాముడు ఒప్పంద కుదుర్చుకుని ఏసీబీ అధికారులకు సమాచారం చేరవేశాడు. శనివారం సాయంత్రం ఏసీబీ డీఎస్పీ, ఐదుగురు సీఐలు పక్కా ప్రణాళికతో ఎమ్మిగనూరు పట్టణ శివారులో వీఆర్వో శ్రీనివాసులు రూ. 1,500.. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు రూ. 1,500 తీసుకుంటుండగా పట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తే 14400 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కామాంధుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య

కోవెలకుంట్ల: అరవై ఏళ్లు పైబడిన మతిస్థిమితం సరిగాలేని ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 23వ తేదీన సంజామలకు చెందిన మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు కోవెలకుంట్ల పట్టణంలో తిరుగుతుండగా కామాంధుడు బైక్‌పై ఎక్కించుకుని స్థానిక ముదిగేడు రహదారిలోని రైల్వే స్టేషన్ వైపు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ మేరకు కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోవెలకుంట్ల ఇన్‌చార్జ్ సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, సంజామల, దొర్నిపాడు ఎస్‌ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, ప్రతాప్, తిరుపాలుతో ప్రత్యేక బృందాలు ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో అత్యాచార కేసు మిస్టరీని ఛేదించారు. సాంకేతిక నైపుణ్యంతో సంజామలకు చెందిన దూదేకుల దస్తగిరి అనే యువకుడు వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించారు. సంజామలలో ఓ సప్లయర్స్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్న ఈ యువకుడు జులాయిగా తిరుగుతూ అమాయకులైన మహిళలకు మాయమాటలు చెప్పి వారిని తన వెంట తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించేవాడని పోలీసుల విచారణలో తేలింది. ఇందులో భాగంగానే కోవెలకుంట్ల బస్టాండ్ సమీపంలో ఉన్న వృద్ధురాలిని సంజామలలో వదులుతానని బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లి అఘాత్యానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా వృద్ధురాలిపై అత్యాచారం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సీఐ రామంజులు, ఎస్‌ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అడవి కుక్క దాడి మృతుల కుటుంబాలకు పరిహారం



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అడవికుక్క దాడిలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు మంజూరైన పరిహారాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పంపిణీ చేశారు. గతేడాది అహోబిలం గ్రామానికి చెందిన గుర్రప్ప, రూపపై అడవి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి కోలుకోలేక మృతి చెందారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 10 లక్షల పరిహారం మంజూరయ్యాయి. శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో మూర్తుజా ఉన్నారు.

855.50 అడుగులుగా శ్రీశైలండ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటి మట్టం శనివారం సాయంత్రానికి 855.50 అడుగులకు చేరుకుంది. జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పాదన నిలిచిపోవడంతో వరద ప్రవాహం నిలిచిపోయింది. సుంకేసుల బ్యారేజి నుంచి 6,710 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరుతుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు దిగువ ప్రాంతాలకు 5,742 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 2,042 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,505, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కులు విడుదల చేశారు. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.674 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 1,296 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 0.40 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 93.1430 టీఎంసీల నీరు నిల్వగా ఉంది.